ప్రభుత్వ బాలికల పాఠశాల నూతన భవన నిర్మాణం చేపట్టాలి

బేగంపేట్, మార్చి 3: సనత్‌నగర్ లోని ప్రభుత్వ బాలికల ప్రాథమిక పాఠశాల విద్యార్థుల కోసం నూతన భవనం నిర్మాణం చేపట్టాలని సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మేడ్చల్ జిల్లా కలెక్టర్‌ను కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్‌కు సనత్‌నగర్ కార్పొరేటర్ కొలన్ లక్ష్మి ద్వారా లేఖను పంపారు. రౌండ్ టేబుల్ స్కూల్‌లో విద్యార్థుల సంఖ్యకు సరిపడా తరగతిగదులు లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారని కార్పొరేటర్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఎమ్మెల్యే తలసాని ఇటీవల స్కూల్‌ను సందర్శించి విద్యార్థులు, స్కూల్ సిబ్బందితో మాట్లాడారు. తరగతిగదుల కొరత కారణంగా చదువుపై శ్రద్ధ చూపలేక పోతున్నారని కార్పొరేటర్, హెచ్ఎం బ్రహ్మచారి వివరించారు. అయితే స్కూల్ సమీపంలో నిరుపయోగంగా ఉన్న పబ్లిక్ హెల్త్ సెంటర్‌లో నూతన ప్రైమరీ స్కూల్ బిల్డింగ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా పబ్లిక్ హెల్త్ సెంటర్ స్థలంలో బిల్డింగ్ నిర్మాణం కోసం అనుమతించాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారిని కోరుతూ లేఖ పంపారు.

క్రమశిక్షణతో లక్ష్యం సులభతరం

చిక్కడపల్లి, మార్చి 3: ఉన్నత లక్ష్యం ఎంచుకొని క్రమశిక్షణతో కృషి చేస్తే అనుకున్న లక్ష్యం సాధించడం సులభతరం అవుతుందని అంబేద్కర్ విద్యా సంస్థ జాయింట్ సెక్రెటరీ రమణ కుమార్ విద్యార్థులకు సూచించారు. బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పాఠశాలలో సోమవారం 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రమణకుమార్ మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో నిరంతర కృషి పట్టుదల నేర్చుకోవాలన్నారు. కాలంతో పాటు నూతన ఆవిష్కరణలను అనుసరించాలని అన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ కళా సంస్థల డైరెక్టర్ విష్ణుప్రియ, పాఠశాల ప్రిన్సిపాల్ విఠలాచారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

- రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి

కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ: కాలానుగుణంగా విద్యాసంస్థలు నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి పిలుపునిచ్చారు. న్యాక్ గుర్తింపు కోసం జరిగే మూల్యాంకన ప్రక్రియలో అధ్యాపకులను సన్నద్ధం చేసేందుకు ఓయూలో మూడు రోజుల వర్క్‌షాప్ నిర్వహిస్తున్నారు. ఠాగూర్ ఆడిటోరియంలో కార్యక్రమం ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా బాలకిష్టారెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఆధునికత కారణంగా విద్యారంగంలో సంచలన మార్పులు చోటుచేసుకుంటున్నాయన్నారు. ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ ఫలితాలను మనం చూస్తున్నామన్నారు. ఆ తర్వాత వచ్చిన కొవిడ్ సంక్షోభం విసిరిన సవాళ్లను అధిగమించి.. విద్యారంగం డిజిటల్ విద్యావిధానాన్ని అందిపుచ్చుకుందని చెప్పారు. అధ్యాపకులు సైతం ఆధునికత సహకారంతో విద్యార్థులకు నైపుణ్యాలను అందించాలని చెప్పారు. న్యాక్ అక్రిడిటేషన్ నాలుగో సైకిల్‌కు వర్క్‌షాప్ ఉపయోగపడుతుందని ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్ అన్నారు. విద్యారంగంలో వస్తున్న డిజిటల్ సవాళ్లను అధిగమించేందుకు అవసరమైన సన్నద్ధతను అందిస్తుందని అభిప్రాయపడ్డారు. ప్రపంచ విద్యారంగంలో కృత్రిమ మేధ విసురుతున్న సవాళ్లను అధ్యయనం చేయటం, అందుకు తగిన పరిష్కారాల ద్వారా విద్యారంగాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. వేగంగా మారుతున్న ఆధునిక సమాజాన్ని అధ్యాపకులు నిశితంగా పరిశీలిస్తూనే, విద్యార్థులకు సరికొత్త నైపుణ్యాలు అందించే విధంగా సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.నరేష్‌రెడ్డి మాట్లాడుతూ విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా అధ్యాపకులు ఎప్పటికప్పుడు నవీకరణ అయ్యేందుకు ఈ వర్క్‌షాప్ ఉపయోగపడుతుందని అన్నారు. సమయాన్ని కేటాయించి సదస్సుకు హాజరైన అధ్యాపకులకు ఓఎస్డీ ప్రొఫెసర్ ఎస్.జితేంద్ర కుమార్ నాయక్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ యూజీసీ డీన్ ప్రొఫెసర్ లావణ్య, ఐక్యూఏసీ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.శిరీష తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

ఉస్మానియా యూనివర్సిటీ: సికింద్రాబాద్ నియోజకవర్గానికి సంబంధించిన ముషీరాబాద్ మండలానికి చెందిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని బౌద్ధనగర్ కమ్యూనిటీ హాల్‌లో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సికింద్రాబాద్ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొని దాదాపు రూ. కోటీ 79 లక్షల విలువజేసే 179 కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను కార్పొరేటర్లు, అధికారులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ పేదలకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వర ప్రసాదంగా నిలుస్తుందని అన్నారు. పేద ప్రజల పిల్లల పెళ్లిళ్ల ఖర్చు ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొనే గత కేసీఆర్ ప్రభుత్వ అద్భుతమైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టిందని అన్నారు. పలు అలవి కాని హామీలను ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కంది శైలజ, లింగాని ప్రసన్న లక్ష్మి, రాసురి సునీత, తహసీల్దార్ ప్రతాప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మసీదుల వద్ద సౌకర్యాల కల్పనకు కృషి చేయనున్నట్లు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. సోమవారం ముషీరాబాద్ ఏక్ మినర్ మసీదును సందర్శించి రంజాన్ సందర్భంగా ఏర్పాట్లు తీరును పరిశీలించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముఠా జయసింహ, ముచ్చకుర్తి ప్రభాకర్, శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్, ఎయిర్టెల్ రాజు, డి.శివ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు. – ముషీరాబాద్ మార్చ్ 3:

హైదరాబాద్ రెండో రాజధాని చేయాలి

సదస్సులో మాట్లాడుతున్న ప్రకాష్ యశ్వంత్ అంబేద్కర్

చిక్కడపల్లి, మార్చి 3: దేశ రక్షణ కోసం హైదరాబాద్ రెండో రాజధానిగా చేయాలని ప్రకాష్‌యశ్వంత్ అంబేద్కర్ అన్నారు. సోమవారం బాగ్లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం రెండో రాజధానిగా హైదరాబాద్ ఏర్పాటు చేయాలని అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రకాష్ యశ్వంత్ అంబేద్కర్ మాట్లాడుతూ దేశ రక్షణ కోణంలో హైదరాబాద్ దేశానికి రెండో రాజధానిగా ఉండాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బలంగా కోరే వారని చెప్పారు. దేశ రాజధాని ఢిల్లీ పాకిస్తాన్ సరిహద్దు నుంచి 300 కిలోమీటర్ల దూరం ఉందని తెలిపారు. దేశ రాజధానికి శత్రువు అంత దగ్గరగా ఉండడం శ్రేయస్కరం కాదని చెప్పారు. ఎప్పుడైతే దేశంలో కులం, మతం ఆధారంగా రాజకీయాలు ప్రారంభమవుతాయో అప్పుడు దేశంలో జాతీయ నాయకుడు అనే వారే ఉండరని అప్పట్లోనే అంబేద్కర్ చెప్పారని గుర్తు చేశారు. భారత్ బలమైన ప్రజాస్వామ్య దేశంగా ఎదగాలంటే కులం మతాలకతీతంగా ఐక్యం కావాలన్నారు. నిర్వాకుడు సంపత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమం లో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ వెంకటనారాయణ, రిటైర్డ్ ఐఆర్ఎస్ నరసమ్మ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అద్దంకి దయాకర్ పాల్గొన్నారు.

సృజనాత్మకతకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం

కవాడిగూడ, మార్చి 2: విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగిఉన్న సృజనాత్మకతను పెంపొందించేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యుడు, బీఆర్ఎస్ నేత వి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కవాడిగూడ డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ స్టేడియం ప్రక్కనున్న సాయిరాం హైస్కూల్ ఆవరణలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యుడు, బీఆర్ఎస్ నేత వి.శ్రీనివాస్‌రెడ్డి, కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ, దోమలగూడ సీఐ శ్రీనివాస్‌రెడ్డి హాజరై ప్రదర్శనను ప్రారంభించి తిలకించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువుతో పాటు విద్యార్థులను వారికి అభిరుచి ఉన్న రంగాల్లో ప్రోత్సహించాలన్నారు. ఇందుకోసం ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థుల ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. బీఆర్ఎస్ నాయకులు కల్వగోపి, సరిగిరి శ్యామ్, బాలయ్య, శివ, జి.వెంకటేష్, ఏనుగు వినయ్‌కుమార్, సలంద్రి దిలీప్, మహేందర్ బాబు, ప్రభాకర్, సాయిరాం కపాల ప్రమీల, కపాల సిద్దార్థ, ప్రిన్సిపాల్ రాజశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థుల పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత వి.శ్రీనివాస్‌రెడ్డి

ప్రభుత్వ పాఠశాలకు వైట్ బోర్డుల వితరణ

పాఠశాలలో వైట్ బోర్డులను అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

అమీర్పేట్, మార్చి 3: సనత్‌నగర్ జెక్ కాలనీకి చెందిన విశ్వ మానవ సంక్షేమ సంఘం సోమవారం యూసఫ్ గూడలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 12 వైట్ బోర్డులు అందజేసింది. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు మస్తాన్‌రావు పెసల మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలుగుతూ గురువులను పెద్దలను గౌరవిస్తూ బాధ్యత గల పౌరులుగా వృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ఎస్.వై.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు వెంకట్ సోమ, కోశాధికారి ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

భోలక్‌పూర్ హౌస్ బస్తీ అధ్యక్షుడిగా శంకర్

శంకర్‌ను సత్కరిస్తున్న బస్తీనాయకులు

ముషీరాబాద్ మార్చి 3: బోలక్‌పూర్ హౌస్ బస్తీ నూతన అధ్యక్షుడిగా కేఎం శంకర్ ఎన్నికయ్యారు. సోమవారం భోలక్‌పూర్ గంగపుత్ర సంఘం కమిటీ హాల్‌లో జరిగిన కార్యవర్గ సమావేశంలో శంకర్‌ను అధ్యక్షుడిగా ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భోలక్‌పూర్ హౌస్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించనున్నట్లు తెలిపారు. త్వరలోనే నూతన కార్యవర్గాన్ని ప్రకటిస్తానని, రాజకీయాలకతీతంగా బస్తీ అభివృద్ధికి కృషిచేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాముయాదవ్, సాయిబాబా గౌడ్, ఆనంద్ రావు, నాగరాజు, విశ్వేశ్వర్, మణికంఠ, వినోద్, నందు, నవీన్, మహేష్, ప్రేమ యాదవ్, నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు అభినందనీయం

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

బాలానగర్, మార్చి 3: ప్రజా సంక్షేమానికి సామాజిక భవనాల్లో (కమ్యూనిటీ హాల్) సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. సోమవారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ హస్మత్‌పేట, అంజయ్యనగర్ లోని కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఈ ఈ గోవర్ధన్ గౌడ్, ఏఈ ఆశ, జలమండలి తేజ, బీఆర్ఎస్ నాయకులు నరేందర్ గౌడ్, ఇర్ఫాన్ మేకల హరినాథ్, మక్కల నర్సింగ్‌రావు, మక్కల సత్యనారాయణ, స్థానికులు పాల్గొన్నారు.

ఆలయ అర్చకుడి స్థానం మార్పుపై ఫిర్యాదు

ఈవోకు ఫిర్యాదు చేసిన అనంతరం స్థానికులు

అమీర్పేట్, మార్చి 3: సనత్‌నగర్ హనుమాన్ ఆలయంలో అధికారులకు కనీస సమాచారం లేకుండా అర్చకుడి స్థానం మార్పు అంశం వివాదంగా మారింది. దేవాదాయ శాఖ పరిధిలోని సనత్‌నగర్ హనుమాన్ ఆలయ ఆవరణలోని ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకత్వం చేస్తున్న విజయేంద్రపై మూడేళ్ల క్రితం భక్తులు ఆరోపణలు చేస్తూ అప్పటి దేవాదాయ శాఖ కమిషనర్‌కు లిఖితపూర్వక ఫిర్యాదులు చేశారు. అప్పట్లో డిప్యూటీ కమిషనర్ అర్చకుడు విజయేంద్రపై విచారణ జరిపి అనంతరం స్థాన మార్పిడిలో భాగంగా అదే ఆలయ ఆవరణలోని పోచమ్మ ఆలయానికి అర్చకుడిగా నియమించారు. కాగా రెండు రోజుల క్రితం స్థానిక కార్పొరేటర్ తిరిగి ఆంజనేయ స్వామి అర్చకునిగా కూర్చోబెట్టినట్టు వస్తున్న ఆరోపణలతో స్థానికులు బి.కృష్ణగౌడ్, పుట్నాల రాజేశ్వర్, బి.రవీందర్ గౌడ్, కె.శ్రీనివాస్‌రెడ్డి, కన్నయ్యయాదవ్, బి.హనుమంతరావు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఈవో సత్యనారాయణ నాయుడుకు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. ఇందుకు స్పందించిన ఈవో విజయేంద్రను తిరిగి పోచమ్మ ఆలయానికి పంపినట్లు ఆదేశాలు జారీ చేశారు.

విద్య వైద్యం ఉపాధిపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి

కవాడిగూడ, మార్చి 3: విద్య, వైద్యం, ఉపాధిపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ సూచించారు. వీటిని ప్రభుత్వాలు లక్ష్యాలుగా పెట్టుకుని ముందుకు వెళ్లాలని ఆయన పిలుపునిచ్చా రు. అప్పుడే సమాజంలో మంచి వాతావరణం నిర్మాణమవుతుందని చెప్పారు. బండారు వైష్ణవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కవాడిగూడ రోటరీ కాలనీలో ఏర్పాటు చేసిన మెగా హెల్త్ క్యాంప్‌ను దత్తాత్రేయ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. పేదలందరికీ ఉచిత వైద్యాన్ని అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతి యువకునికి నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి కల్పించాలన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్య, వైద్యం, ఉపాధికి ప్రాముఖ్యతనిస్తూ పేదలకు తోడ్పాటునందిస్తున్నామని తెలిపారు. ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలకు అన్నిరకాల వైద్య సేవలను అందిస్తున్నామని తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగిన శిబిరంలో ట్రైడెంట్ హాస్పిటల్ వైద్యులు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఫౌండేషన్ నిర్వహకులు బండారు విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు గుండగోని భరత్‌గౌడ్, కార్పొరేటర్లు రచనశ్రీ, పావని, సుప్రియ, నాయకులు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, వినయ్‌కుమార్, రమేష్‌రామ్, జి.వెంకటేష్, పరిమళ్‌కుమార్, సలంద్రి దిలీప్ యాదవ్, మహేందర్‌బాబు, విఠల్‌రావు, ప్రభాకర్, రమేష్‌బాబు, లింగంగౌడ్, ఆంజనేయులు, రోటరీ కాలనీ అధ్యక్షుడు యాదగిరి బస్తీవాసులు పాల్గొన్నారు.

డాక్టర్ గాయత్రిదేవికి ఋషి పీఠం పురస్కారం

డాక్టర్ గాయత్రిదేవికి ఋషిపీఠం పురస్కారం అందించి సత్కరిస్తున్న

బన్సీలాల్ పేట్, మార్చి 3: ఋషి పీఠం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పద్మారావు నగర్‌లోని కౌతా కామకోటి కల్యాణ నిలయంలో పురస్కార ప్రదానోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ సనాతన ధర్మ ఔన్నత్యాన్ని పరిరక్షించుకోవడం, భావితరాలకు అందించడం మనందరి బాధ్యత అని అన్నారు. ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ సామవేదం షణ్ముఖశర్మ ఆధ్వర్యంలో ఆయుర్వేద డాక్టర్ అల్లంరాజు గాయత్రిదేవి, దంపతులకు పురస్కారాన్ని అందజేసి, సన్మానించారు. విశ్రాంత ప్రొఫెసర్ వీవీఎస్ రామశాస్త్రి, డాక్టర్ ఆర్.విద్యానాథ్, ట్రస్టీ మారేపల్లి సూర్యనారాయణ, సభ్యులు ఆంజనేయ శాస్త్రి, రాధాకృష్ణ, నారాయణరావు, రమణ మూర్తి, పుల్లయ్యశర్మ, మల్లాది ప్రసాద్, మురళీకృష్ణ, అమర్నాథ్, హనుమంతరావు, వేణుగోపాల్, శాస్త్రిశర్మ. సిద్ధారెడ్డి, రఘురాం, తదితరులు పాల్గొన్నారు.

గోస్వామి బిరుదు ప్రదానం

బిరుదు ప్రదానం చేస్తున్న డాక్టర్ ఎల్‌వీ సుబ్రహ్మణ్యం

ముషీరాబాద్, మార్చి 3: శ్రీభారతి ఫౌండేషన్, శ్రీభారతి మ్యూజిక్ అకాడమీల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం త్యాగరాయ గానసభలో గో గీత డాక్యుమెంటరీ చిత్ర ప్రదర్శన, గో స్వామి బిరుదు ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ ఆఫీసర్ డాక్టర్ ఎల్‌వీ సుబ్రహ్మణ్యం ముఖ్యఅతిథిగా పాల్గొని డాక్టర్ నిట్టల గోపాలకృష్ణకు గోస్వామి బిరుదు ప్రదానం చేశారు. ఆచార్య టి గౌరీ శంకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ సీఎన్ గోపీనాథ్‌రెడ్డి, మర్రి కృష్ణారెడ్డి, విజయరామ్, కె.శివకుమార్, శ్రీనివాస బంగారయ్య శర్మ, బండారుపల్లి రామచంద్రరావు, తనికెళ్ల సూర్య మీనాక్షి, చింతల పాటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిశోధక విద్యార్థుల సబ్మిషన్ గడువు పొడిగించాలి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వివిధ విద్యార్థి సంఘాల నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని 2018 బ్యాచ్‌పరిశోధక విద్యార్థులు తమ థీసెస్ సమర్పించేందుకు గడువును ఒక సంవత్సరం పాటు పొడగించాలని వివిధ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇప్పటికే ఈ సమస్యను వర్సిటీ వీసీ, రిజిస్ట్రార్‌లకు తెలిపినప్పటికీ వారు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తమ వినతి పత్రాన్ని తీసుకొని ఫిబ్రవరి 28లోపు దీనిపై నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. వారు ఇచ్చిన సమయం గడిచిపోయినా ఇప్పటికీ తేల్చలేదని మండిపడ్డారు. అధికారుల వైఖరితో పరిశోధకు విద్యార్థులు మానసికంగా తీవ్ర ఆందోళన చెందుతున్నారని వాపోయారు. విద్యార్థుల న్యాయమైన ఈ డిమాండ్ పై అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు. 2018 పరిశోధక విద్యార్థుల ప్రవేశాలు 2019 వరకు సాగాయని గుర్తు చేశారు. సంవత్సరం గడిచిన వెంటనే కరోనాతో రెండేళ్ల విలువైన కాలాన్ని పరిశోధక విద్యార్థులు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతోపాటు ఫెలోషిప్స్ లేక పరిశోధనలు ముందుకు సాగలేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

అలరించిన ప్రముఖ గాయకుడు 'శేషు పాటల బహార్'

చిక్కడపల్లి, మార్చి 3: ప్రముఖ గాయకుడు టి.శేషగిరిరావు ఆధ్వర్యంలో 12 గంటల నిర్విరామ 'శేషు పాటల బహార్' సోమవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని కళాభారతి సిటీ కల్చరల్ సెంటర్‌లో నిర్వహించారు. మహోత్సవంలో 40 మంది గాయకులు శేషగిరి రావుతో గొంతు కలిపి అనేక మధుర గీతాలు ఆలపించి శ్రోతలను అమితానందంతో మైమరిపించారు. ప్రముఖ పాత్రికేయుడు సిటీ కల్చరల్ సెంటర్ అధినేత పురుషోత్తం నారగౌని మాట్లాడుతూ వర్తమాన సంగీత ప్రపంచంలో అపారమైన సేవలందిస్తున్న గొప్ప కళాకారుడు, ఘంటసాల గీతాలకు తన గాత్రంతో తిరిగి ప్రాణం పోసి, భవిష్యత్తు తరాలకు ఆయన సంగీతాన్ని అందించే బాధ్యత తీసుకున్న మహానుభావుడు అని అన్నారు. ఈ సందర్భంగా శేషగిరిరావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంవీఎస్ లక్ష్మి, ఉషామోడీ తదితరులు పాల్గొన్నారు.

వినికిడి సమస్యలపై అవగాహన

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ మనోజ్‌రెడ్డి

ముషీరాబాద్, మార్చి 23: వినికిడి సమస్యలను సకాలంలో గుర్తిస్తే వైద్య సేవలు పొంది సమస్యను నివారించవచ్చని ముషీరాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డి అన్నారు. సోమవారం ప్రపంచ వినికిడి దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండె ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని, అధిక రక్తపోటు, కొలెస్ట్రాల్ వంటి సమస్యలను రాకుండా చూసుకోవాలని అన్నారు. కాలుష్యం వినికిడి సమస్యపై ప్రభావం చూపుతోందని, ఇయర్ ప్లగ్స్ వినియోగించడం అలవాటు చేసుకోవద్దని సూచించారు. ఫోన్ హెడ్సెట్స్ ఉపయోగించినప్పుడు అధిక శబ్దం ఉండరాదని, మద్యపానం, దూమపానంకు దూరంగా ఉండాలని సూచించారు. వినికిడి సమస్యను అశ్రద్ధ చేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత నోట్ పుస్తకాల పంపిణీ

సికింద్రాబాద్, మార్చి 3: సికింద్రాబాద్ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఉచిత నోటు పుస్తకాలను సోమవారం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి కాచిగూడ మున్నూరు కాపు మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వరరావు, మహాసభ మాజీ అధ్యక్షుడు చంద్రమోహన్, మణికొండ రమేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ సికింద్రాబాద్‌లో పేద మున్నూరు కాపు విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని ఉచిత నోటు పుస్తకాలను పంపిణీ చేసామన్నారు. నోటు పుస్తకాల పంపిణీ కోసం సంఘం కమిటీ, సంఘం నాయకులు ఆర్థిక సాయం అందజేశారని తెలిపారు. మున్నూరు కాపు పేద విద్యార్థుల కోసం సికింద్రాబాద్ మున్నూరు కాపు సంఘం ఎప్పుడు ముందుంటుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీకాంత్, శ్రీనివాస్, సతేందర్, మాణిక్ ప్రభు, చందు, మోహన్, పవన్, రుద్రాకర్‌లతో పాటు కమిటీ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.